సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023




సకాలంలో పరిష్కరించాలి

స్పందన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. 8లో




సేవా దృక్పథం అవసరం

ప్రతి ఒక్కరికి సేవా దృక్పథం అవసరమని సీపీ త్రివిక్రమ్ వర్మ అన్నారు. పోలీసులకు మజ్జిగ, అరటిపళ్లు పంపిణీ చేశారు. 10లో



అయ్యో.. మరిచిపోయా..!

నేటి ఉరుకులపరుగుల జీవితంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా చాలా మంది మతిమరుపు సమస్యతో బాధపడుతున్నారు. 10లో



న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎంపీ ఎంవీవీ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎంపీ ఎంవీవీ, జీవీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిని సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు సీఎంతో చర్చించారు.

నగరంలో మాజీ ఉపరాష్ట్రపతి



వెంకయ్యనాయుడుకి స్వాగతం పలుకుతున్న పోర్టు చైర్మన్ రామచంద్రన్

సాక్షి, విశాఖపట్నం: భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సోమవారం విశాఖపట్నం చేరుకున్నారు. పోర్ట్ ట్రస్ట్ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు పోర్ట్ చైర్మన్ టి.కె.రామచంద్రన్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చైర్మన్ వివరించారు. మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, సెక్రటరీ వేణుగోపాల్, పోర్టు అధికారులున్నారు.

పోర్టులో రికార్డు స్థాయి లోడింగ్

1.02 లక్షల మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ హ్యాండ్లింగ్



పోర్టులో ఐరన్ ఓర్ లోడింగ్

సాక్షి, విశాఖపట్నం : మరో అరుదైన రికార్డును విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) తన ఖాతాలో వేసుకుంది. ఇన్నర్ హార్బర్‌లో పోర్టు చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా ఐరన్ ఓర్ ధాతువుల లోడింగ్ చేస్తూ రికార్డు సృష్టించింది. 1,02,200 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్‌ని ఏకకాలంలో పార్సిల్ లోడింగ్ చేసినట్లు పోర్టు అధికారులు ప్రకటించారు. గతంలో లక్ష మెట్రిక్ టన్నుల లోడింగ్ మాత్రమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. సోమవారం యూరో ప్రతీక్ ఇస్పాట్ లిమిటెడ్ సంస్థకు సంబంధించిన ఐరన్ ఓర్ ఫైన్స్‌ని బోత్రా షిప్పింగ్ సర్వీస్ ఏజెన్సీ ఈక్యూ9 బీబీకేప్ వెసల్‌లో రికార్డు స్థాయిలో లోడ్ చేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు.

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

కంచరపాలెం : రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి (2023–24) ఈ నెల 23న పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లాలో 3, అనకాపల్లి జిల్లాలో 8 గురుకులాల్లో 5వ తరగతిలో 880 సీట్ల కోసం 3,496 మంది విద్యార్థులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 880 సీట్లకు 1,969 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు http;//apgpcet.a pcfss.in, ఇంటర్ విద్యార్థులు http;//apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641, 7207000723 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

మురిపిస్తున్న మామిడి

టన్ను రూ.లక్ష!

- మార్కెట్లో బంగినపల్లికి అత్యధిక ధర
- ఇతర రకాలకూ మంచి రేటు
- సువర్ణరేఖ రూ.62 వేలు..
- పణుకుల రకం రూ.40 వేల నుంచి 50 వేలకు కొనుగోలు
- రైతులకు కాసులు కురిపిస్తున్న మామిడి



సాక్షి, విశాఖపట్నం: మామిడికి మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. ఈ ఏడాది మామిడికాయల కాపు అంతంతమాత్రంగా ఉంది. పైగా కాపు ఆలస్యంగా వచ్చింది. దీంతో ధర ఆకాశాన్ని అంటుతోంది. పది రోజుల క్రితం బంగినపల్లి టన్ను ధర దాదాపు రూ.లక్ష వరకు పలికింది. మామిడిలో రారాజుగా బంగినపల్లికి ప్రత్యేక స్థానం ఉంది. దీంతో ఇతర రకాలకంటే బంగినపల్లినే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం దీనికున్న డిమాండ్‌ను బట్టి టన్ను రూ.70–80 వేల మధ్య ఉంది. ఆ తర్వాత స్థానంలో సువర్ణరేఖ కొనసాగుతోంది. ఈ రకం ప్రస్తుతం రూ.62 వేల వరకు అమ్ముడుపోతోంది. ఇంకా పణుకుల రకం రూ.40–50 వేలు, రాజు మామిడి రకం రూ.32 వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 వేల ఎకరాల్లో మామిడితోటలున్నాయి. వీటిలో బంగినపల్లి, సువర్ణరేఖతో పాటు తోతాపురి (కలెక్టర్), చెరకు రసాలు, గోవా, నీలం తదితర రకాలు పండుతున్నాయి. సాధారణంగా మార్చి మొదటి వారానికల్లా మార్కెట్లో మామిడికాయలు అందుబాటులోకి వస్తాయి. మార్కెట్లో ముందుగా కాపుకొచ్చే రకాలకు మంచి ధర లభిస్తుంది. కానీ ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల నెలన్నర ఆలస్యంగా కాపు మొదలైంది. పైగా 50 శాతం లోపే కాపు కాసింది. మరోవైపు ఆవకాయ పచ్చళ్లకు పచ్చి మామిడికాయలు కొంటారు. ప్రస్తుతం మామిడికాయలు పక్వానికి రాకపోయినా పచ్చళ్లకు పనికొస్తాయి. ఇవన్నీ వెరసి మామిడికి మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ఇది ధర పెరగడానికి కారణమవుతోంది. ప్రస్తుతం మార్కెట్లో మామిడికి ఉన్న ధర లాభదాయకంగా ఉందని రైతులు ఒకింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సీజను ఆరంభంలో సువర్ణరేఖ రకం టన్ను ధర రూ.85 వేలకు పైగా విక్రయాలు జరిగాయని పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన మామిడి రైతు వైదా గురునాథరావు 'సాక్షి'కి చెప్పారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ఈ ప్రాంతంలో మామిడి పళ్లు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. నేల స్వభావం రీత్యా ఇక్కడ కాసిన మామిడికి రుచి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అక్కడి వారు ఈ ప్రాంత మామిడిని బాగా ఇష్టపడతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ మామిడి కొనుగోలుకు ఆయా రాష్ట్రాల వ్యాపారులు ఆసక్తి చూపుతారు. కొంతమంది తమ ప్రతినిధులను ఇక్కడకు పంపించి కొనుగోలు చేస్తారు. మరికొందరు ఫోన్ల ద్వారా స్థానిక వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఇక్కడ నుంచి లారీలు, రైల్వే వ్యాగన్ల ద్వారా మామిడిని రవాణా చేస్తుంటారు.

టన్ను రూ.65 వేలకు విక్రయించా..



నాకు ఏడెకరాల మామిడితోట ఉంది. అందులో ముందుగా పణుకుల రకం కోతకు వచ్చింది. పక్షం రోజుల క్రితం టన్ను రూ.45 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇటీవల సువర్ణరేఖ రకం టన్ను రూ.65 వేలకు విక్రయించా. ప్రస్తుతం మార్కెట్లో సువర్ణరేఖ, బంగినపల్లి, రాజుమామిడి వంటి వాటికి మంచి ధర లభిస్తోంది. ఈ ఏడాది కాపు 50 శాతం కూడా లేదు. కాపు తక్కువ అయినప్పటికీ ప్రస్తుత రేటు ఊరటనిస్తోంది.

– రెడ్డిపల్లి శంకరరావు, మామిడి రైతు, శేరిఖండం, పద్మనాభం మండలం.

నిప్పుల కుంపటి!

- ఉమ్మడి విశాఖ కుతకుత
- అత్యధికంగా కోటవురట్లలో 43.56 డిగ్రీలు
- పద్మనాభంలో 41.36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో మూడు రోజులు వడగాడ్పులు





సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ కుతకుతలాడుతోంది. ఉష్ణతాపం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ దడ పుట్టిస్తున్నాయి. వరసగా వారం రోజుల నుంచి వడగాడ్పులు వీస్తూనే ఉన్నాయి. సోమవారం కూడా అవే సెగలు కొనసాగాయి. విశాఖ జిల్లా కంటే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మరింతగా అదుపు తప్పాయి. అనేక ప్రాంతాల్లో 40–43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికంగా అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 43.56 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో 42.42, విశాఖ జిల్లా పద్మనాభంలో 41.36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రోజంతా వడగాడ్పులు వీచాయి. రోజూ కాస్తున్న ఎండలు, వీస్తున్న వడగాడ్పుల ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. సూర్యోదయం అయిన రెండు మూడు గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం వరకు నిప్పులు కక్కుతూనే ఉన్నాడు. జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేస్తున్నారు. వచ్చే మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. జనం ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	కోటవురట్ల	43.56
అనకాపల్లి	దేవరాపల్లి	42.82
అనకాపల్లి	నర్సీపట్నం	42.20
అనకాపల్లి	చోడవరం	41.43
అనకాపల్లి	అనకాపల్లి	40.61
అల్లూరి	చింతూరు	42.42
అల్లూరి	కూనవరం	41.60
అల్లూరి	గంగవరం	41.51
విశాఖపట్నం	పద్మనాభం	41.36
విశాఖపట్నం	గంభీరం	40.48
విశాఖపట్నం	సింహాచలం	40.00
విశాఖపట్నం	మహారాణిపేట	40.00

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి సీఎం హామీ



ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందిస్తున్న మేయర్ దంపతులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, అక్కరమాని దంపతులు

డాబాగార్డెన్స్: విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు, పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మేయర్ హరివెంకటకుమారి దంపతులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగరాభివృద్ధి, జీవీఎంసీ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి మేయర్ తీసుకెళ్లారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నిధులు కేటాయిస్తామన్నారని ఆమె తెలిపారు.

అద్దె బస్సుల టెండర్లపై అవగాహన

డాబాగార్డెన్స్: ద్వారకాబస్‌స్టేషన్‌లోని ప్రాంతీయ మేనేజర్ కార్యాలయంలో సోమవారం అద్దె బస్సుల టెండర్లపై డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు అవగాహన కల్పించారు. కార్గో సెక్షన్‌ను తనిఖీ చేశారు. బస్సుల ఎమర్జెన్సీ డోర్ల పనితీరు పరిశీలించారు. షిప్ మంత్రా పార్సెల్ బుకింగ్ ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీడీఎం జి.సత్యనారాయణ, ఏటీఎం అమరసింహ, పలువురు అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయానికే దర్శనం

- ఈసారి ప్రొటోకాల్‌లోనూ టైమ్ స్లాట్ల విభజన
- సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- చందనోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు



రూ.1000 టికెట్లకు 5 స్లాట్లు

సాక్షి, విశాఖపట్నం : సింహగిరిపై ఉన్న వరహాలక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవానికి అధికార యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా స్వామివారి నిజరూప దర్శనం కోసం ఏటా లక్షలాది మంది భక్తులు సింహగిరికి చేరుకొని దర్శించుకుంటారు. భక్తులు పోటెత్తడంతో ఆ ప్రాంతంలో రద్దీ వాతావరణం నెలకొంటుంది. గత ఏడాది గతంలో టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ సమయంలో బోర్డు మెంబర్లు ఒకేసారి దర్శనానికి రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. గంటపాటు దర్శన సమయంలో తోపులాటలు జరగడం పలు విమర్శలకు దారితీసింది. ఈసారి అలాంటి పొరపాట్లు దొర్లకుండా స్లాట్ల విభజనతో దర్శనం చేసుకునేలా కలెక్టర్ డా.మల్లికార్జున ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. సింహాచలం ఈవో త్రినాథరావు, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, ఇతర అధికారులతో పలుమార్లు సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధవహించారు. గతేడాది వచ్చిన విమర్శలు ఈ ఏడాది రాకుండా నిజరూప దర్శనం ముగిసేంత వరకూ ప్రణాళికాబద్ధంగా దర్శనాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఏటా అప్పన్న నిజరూపదర్శనం వేకువ జామున మొదలవుతుంది. తొలుత ఏటా వస్తున్న సంప్రదాయం ప్రకారం ఆలయ అనువంశిక ధర్మకర్త కుటుంబీకులు స్వామివారిని దర్శించుకుంటారు. టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ అనంతరం దేవదాయ శాఖ మంత్రి దర్శనం చేసుకోనున్నారు. గతంలో ఈ సమయంలో అస్తవ్యస్తంగా మారింది. ఇప్పుడా పరిస్థితి తలెత్తకుండా విభజించనున్నారు. బోర్డు మెంబర్లకు కూడా స్లాట్ ఏర్పాటు చేస్తున్నారు. బోర్డు మెంబర్లకు ఇచ్చే టికెట్లలో ఫస్ట్ స్లాట్‌లో 1 ప్లస్ 5 మాత్రమే అనుమతించనున్నారు. బోర్డు మెంబర్ల వద్ద మిగిలి ఉన్న టికెట్స్‌ను స్లాట్–2, స్లాట్–3లో దర్శనానికి అనుమతిస్తారు. ప్రొటోకాల్‌లోనూ టైమ్ స్లాట్లుగా పంపించాలని భావిస్తున్నారు. ప్రతి టికెట్‌పైనా టైమ్ స్లాట్ నిర్దేశించనున్నారు. రూ.1000 టికెట్లకు 5 స్లాట్స్‌గా విభజించారు. ప్రతి మూడు గంటలకు ఒక స్లాట్ ఇవ్వనున్నారు. ఇలా టైమ్ స్లాట్స్ ఇవ్వడం వల్ల నిర్దేశించిన సమయానికి మాత్రమే భక్తులు వస్తారని, దీని వల్ల దర్శన రద్దీతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తవని అధికారులు భావిస్తున్నారు. టైమ్ స్లాట్స్, పాసుల కేటాయింపు, టికెట్ల జారీపై మంగళవారం లేదా బుధవారం కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో చందనోత్సవం టికెట్లు

నేటి నుంచి అందుబాటులోకి..

సింహాచలం: సింహగిరిపై ఈనెల 23న జరిగే చందనోత్సవానికి రూ.300, రూ.1000 టికెట్లు మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. www.aptemples. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా భక్తులు టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే సింహాచలంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంకుల్లో కూడా టికెట్లు విక్రయిస్తామని పేర్కొన్నారు. కాగా సింహాచలం దేవస్థానం చరిత్రలో చందనోత్సవం టికెట్ల విక్రయం ఆన్‌లైన్ ద్వారా జరపడం ఇదే తొలిసారి కావడం విశేషం.

సచివాలయ సేవలకు కంట్రోల్ రూమ్

- కలెక్టరేట్ నుంచి 607 సచివాలయాల పర్యవేక్షణ
- పది మంది సిబ్బంది నియామకం
- ప్రతి విభాగాధికారి కంట్రోల్‌రూమ్‌ను పర్యవేక్షించేలా మార్గదర్శకాలు
- సచివాలయాల పనితీరు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు



సచివాలయాల కంట్రోల్‌రూమ్



కంట్రోల్‌రూమ్‌ని పరిశీలిస్తున్న విభాగాధికారులు

సాక్షి, విశాఖపట్నం : సచివాలయాల వేదికగా.. అన్ని ప్రభుత్వ శాఖల సేవలు ప్రజల ముంగిటకు వచ్చి చేరాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగ్గా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం వినూత్న ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సచివాలయాల సేవల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తోంది. పింఛన్ నుంచి ఇంటి స్థలం వరకూ అర్జీ నుంచి ఆధార్ అప్‌డేషన్ వరకూ ప్రతి పనీ నిర్దేశించిన సమయంలోనూ పూర్తి చేసే విధంగా కంట్రోల్ రూమ్ పర్యవేక్షించనుంది.

క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు, అధికారుల కోసం ఎదురుచూసే పరిస్థితి నుంచి ప్రజల ముంగిటకే ఉద్యోగుల్ని తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామీణ, పట్టణ, నగర పరిధిలో ప్రభుత్వం అందించే సేవలు, పథకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలన్న ఉద్దేశంతో మొదలైన సచివాలయాలు ఇప్పుడు ప్రజలకు అద్భుతమైన సేవలను అందిస్తున్నాయి. జిల్లా పరిధిలో 545 వార్డు సచివాలయాలు, 62 గ్రామ సచివాలయాలున్నాయి. సేవల్లో జాప్యం, సమస్యల పరిష్కారంలో అలసత్వం లేకుండా మొత్తం 607 సెక్రటేరియట్లు అందించే పనులను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన కంట్రోల్ రూమ్ ద్వారా సచివాలయం ద్వారా అందుతున్న 544 సేవల పర్యవేక్షణ జరగనుంది.

ప్రతి విభాగాధికారి సందర్శించాల్సిందే..

ఏపీ సేవా పోర్టల్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు మరింత మెరుగ్గా అందించడానికి కలెక్టరేట్‌లో సచివాలయాల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. టిడ్కో, ఐసీడీఎస్, పౌర సరఫరాలు, నాడు–నేడు, సర్వశిక్షా అభియాన్, విద్యా, మధ్యాహ్న భోజనం, ఆరోగ్య శ్రీ , హౌసింగ్ తదితర శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, పనుల పురోగతి పై రోజువారీ నివేదికలను కలెక్టర్‌కు ఈ కంట్రోల్ రూమ్‌లో పనిచేసే సిబ్బంది అందించనున్నారు. దీని ద్వారా ఎక్కడైనా సేవలు ఆలస్యంగా అందినా, సరిగ్గా అందకపోయినా సరిదిద్దే వ్యవస్థ ఏర్పడనుంది. కంట్రోల్ రూమ్‌ను డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, జేసీ కేఎస్ విశ్వనాథన్ పర్యవేక్షించనున్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 10 మంది సిబ్బందిని నియమించారు. వీరందరికీ ప్రత్యేకంగా 10 మొబైల్స్ కొనుగోలు చేశారు. ప్రతి సచివాలయానికి కాల్ చేసి ఒక్కో అర్జీకి సంబంధించిన వివరాలను సేకరించి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు.

సచివాలయాలదే కీలక పాత్ర



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకమైనా ప్రజలకు చేరేందుకు సచివాలయాలది కీలకపాత్ర. కొన్ని సచివాలయాల పరిధిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు సరిగా చేరడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోని గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయంలో సచివాలయాల కంట్రోల్ రూంను ఏర్పాటు చేశాం. ఈ కాల్ సెంటర్ ద్వారా ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు వారి శాఖ ద్వారా అందించే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎందుకు చేరడం లేదో పరిష్కారం చూపవచ్చు. దీనిని వినియోగించుకోవాలని ప్రతి విభాగ ఉన్నతాధికారికి ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సచివాలయాల సిబ్బందిని హెచ్చరించాం.

– డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. కంచరపాలెంలోని కెమికల్ ఇంజినీరింగు కాలేజీలో పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. పదో తరగతి అనంతరం కేవలం మూడేళ్ల /మూడున్నరేళ్ల వ్యవధిలో సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా తక్షణ ఉపాధి పొందవచ్చని చెప్పారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులు చేసిన విద్యార్థులకు కంపెనీల్లో మంచి వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఉద్యోగాల కల్పనలో పాలిటెక్నిక్ విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ బాలిక రూ.6.80 లక్షల అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పాలిటెక్నిక్ చేయడం వల్ల ఉద్యోగాలు పొందడం లేదా ఈసెట్ రాసి ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో నేరుగా చేరవచ్చని చెప్పారు. ఉచిత శిక్షణ అనంతరం ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, సంబల్‌పూర్ డివిజన్ టిట్లాఘడ్–తెరుబలి మధ్య వంతెన పునర్నిర్మాణ పనుల నిమిత్త పవర్ బ్లాక్, ట్రాఫిక్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

- విశాఖలో ఈ నెల 21న బయల్దేరే విశాఖ–రాయ్‌పూర్ (08527) పాసింజర్ స్పెషల్, రాయ్‌పూర్‌లో ఈ నెల 21న బయల్దేరే రాయ్‌పూర్–విశాఖ (08528) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.
- ఈ నెల 20న నిజాముద్దీన్‌లో ఉదయం 7గంటలకు బయల్దేరవలసిన నిజాముద్దీన్–విశాఖ (12808) సమతా ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 9.30గంటలకు బయల్దేరుతుంది. తిరుపతిలో ఈ నెల 20న ఉదయం 10.50గంటలకు బయల్దేరవలసిన తిరుపతి –బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.50గంటలకు బయల్దేరుతుంది.

వినతులను సకాలంలో పరిష్కరించాలి

కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: స్పందన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో స్పందన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ , రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి , ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున దరకాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెండింగ్ దరకాస్తులను తక్షణం పరిష్కరించాలన్నారు. శిశు ఆధార్ నమోదులో అలసత్వం వహించకూడదని జిల్లా వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ నమోదుకు అవసరమైన జనన ధ్రువపత్రాలను ఆస్పత్రులలోనే ప్రసవం అనంతరం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజలనుంచి 147 అర్జీలు స్వీకరించారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సమయపాలన పాటించాల్సిందే..

- అధికారుల గైర్హాజరుపై మండిపడ్డ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో గ్రీవెన్స్ నిర్వహించే రోజున అధికారులందరూ సమయపాలన పాటించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చే వినతులపై వచ్చే గ్రీవెన్స్ నాటికి అధికారుల వద్ద స్టేటస్ ఉండాలని, మొక్కుబడిగా చెప్పే ప్రసక్తే లేదన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కమిషనర్ సాయికాంత్ వర్మ సరిగ్గా 11 గంటలకు వచ్చారు. అప్పటికి పలువురు అధికారులు గ్రీవెన్స్ సెల్‌కు హాజరుకాలేదు. దీంతో కమిషనర్ మండిపడ్డారు. కచ్చితంగా అటెండెన్స్ షీట్ పెట్టాలని ఆదేశించారు. ఆ తర్వాత ఒక్కొక్క అధికారి గ్రీవెన్స్ సెల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలను వచ్చే స్పందనలోగా సిద్ధం చేయాలన్నారు. ఆయా వివరాలను తరువాత వారంలో అందించడం వల్ల నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయో తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని సూచించారు.


గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

పోలీసు స్పందనకు 61 ఫిర్యాదులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సి.ఎం. త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజుతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ

జలకాలాటలలో..



మండుతున్న ఎండ..వెండి వర్ణంలో సంద్రం..ఉరకలేసే విన్యాసం.. జలధి సన్నిధిలో కుర్రాళ్ల విన్యాసాలు వావ్ అనిపించాయి. నవీన భంగిమల్లో కళ్లు చెదిరే, గుండెలదిరే సాహసాలతో అబ్బురపరిచారు.. ఫిషింగ్ హార్బర్‌లో కొందరు యువకులు ఇలా విన్యాసాలతో అలరించారు. ఎండ నుంచి ఉపశమనం పొందారు.




- ఫొటోలు: ఎమ్‌డి నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్

దొంగ దొరికాడు

- నెల రోజుల వ్యవధిలో 9 దొంగతనాలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- చోరీ ఘటనలపై స్పెషల్ డ్రైవ్‌తో సత్ఫలితం

సాక్షి, అనకాపల్లి: రెండు మూడు రోజులపాటు ఇంటికి తాళం వేసి ఉంటే చాలు కన్నేస్తాడు.. ఒకటి రెండు రోజులు పరిశీలిస్తాడు.. మధ్యాహ్నం లేదా అర్ధరాత్రి సమయంలో సునాయాసంగా పనిముగించేస్తాడు.. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో 9 ఇళ్లను దోచుకున్న ఘరానా దొంగ చాకచక్యమిది.. అయితే కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చోరీ కేసుల పరిష్కారంపై స్పెషల్ డ్రైవ్ పెట్టడంతో సోమవారం పోలీసు వలకు చిక్కాడు. అతను కె.కోటపాడు, అనకాపల్లి రూరల్, చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట, వి.మాడుగుల మండలాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు గుర్తించారు. వీటిలో ఒకటి మినహా మిగతా ఎనిమిది దొంగతనాలు తాళం వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. అతని వద్ద రూ.3,61,800 నగదు, 17 3/4 తులాల బంగారం, 115 తులాల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చీడికాడ, మాడుగుల, చోడవరం మండలాల్లో గతంలో జరిగిన చిన్నపాటి దొంగతనాలను సైతం ఇతనే చేసినట్టు గుర్తించారు. చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన నిందితుడు పిల్లి నూకరాజును, అతను దోచుకున్న సొత్తును ప్రదర్శిస్తూ ఎస్పీ సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

సత్ఫలితమిచ్చిన స్పెషల్ డ్రైవ్

ఎస్పీగా కె.వి.మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే క్రైం విభాగం పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏడాదిగా జిల్లాలో ఎన్ని దొంగతనాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరా తీశారు. కొత్త జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎన్ని దొంగతనాలు జరిగాయి..? వాటిలో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నారు. పరిష్కారం కాని దొంగతనాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. వాటిని త్వరితగతిన విచారించాలని ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఎక్కువగా దొంగతనాలు జరిగే ప్రాంతంలో చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పాత నేరస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పి.సత్యనారాయణరావు, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆధ్వర్యంలో పకడ్బందీగా పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సోమవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో కోటపాడు మండలంలో మేడిచర్ల జంక్షన్ దగ్గర ముందస్తు సమాచారంతో కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు, ఎస్సై రాజాన ధనుంజయ బృందం తనిఖీలు చేస్తూ.. నిందితుడు పిల్లి నూకరాజును అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించడంతో కె.కోటపాడు, అనకాపల్లి రూరల్, చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట, వి.మాడుగుల పోలీస్ స్టేషన్ల పరిధిలో తొమ్మిది ఇంటి దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు.


నిందితుడిని ప్రదర్శించి, మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ. చిత్రంలో అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది

స్వాధీనం చేసుకున్న సొత్తు

రూ.3,61,800 నగదు
17 3/4 తులాల బంగారం
115 తులాల వెండి

దొంగతనాలు ఇవే...

- ఈనెల 4న బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో ఆటోడ్రైవర్ పాము రాము ఇంట్లో ఎవరూ లేని సమయంలో బైక్‌పై వచ్చి ఇంటి తాళాలు పగులగొట్టి 8 తులాల బంగారం, 34 తులాల వెండి ఆభరణాలు, రూ.18,500 నగదు అపహరించుకుపోయారు.
- కె.కోటపాడులో 11వ తేదీన పట్టపగలు పక్కపక్కనే వున్న మూడిళ్లలో చోరీలు జరిగాయి. 8 తులాల బంగారు నగలు, లక్షా 90 వేల రూపాయల నగదు అపహరించుకుపోయారు.
- చోడవరంలో రెండు చిన్నపాటి దొంగతనాలు జరిగాయి. వెంకన్నపాలెంలో రూ.5 వేలు, వెంకన్నపాలెం రోడ్డు ఆనుకుని ఉన్న షోరూం యజమాని ఇంట్లో లాప్‌టాప్, రూ.10 వేల నగదు దొంగతనం జరిగింది.
- అనకాపల్లి గాంధీనగర్‌లో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి 7 తులాల బంగారం దోచుకుపోయారు.
- 10వ తేదీన మాడుగుల మండలం జంపన గ్రామంలో ఇంటి తాళాలు పగలుకొట్టి రెండున్నర తులాల బంగారం చోరీ జరిగింది. అదేరోజు మాడుగుల మండలం వీరనారాయణం గ్రామంలో అర తులం, రూ.20 వేల నగదు దొంగతనం జరిగింది.
- వీటితోపాటుగా చీడికాడలో ఈనెల 8న చిన్నపాటి దొంగతనాలకు పాల్పడ్డాడు. అయితే ఈ కేసుల్లో బాధితులు పోలీసులను ఆశ్రయించలేదు.

సిరి వెంకటేశ్వర కార్పొరేట్ బ్రాంచ్ వార్షికోత్సవం

సీతమ్మధార (విశాఖ ఉత్తర): సిరి వెంకటేశ్వర డెవలపర్స్ సంస్థ సీతమ్మధార బ్రాంచ్ ఏడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సీతమ్మధారలోని కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ సంస్థ స్థాపించి 16 ఏళ్లలో ఇప్పటి వరకు 20 వెంచర్స్‌ను వేశామన్నారు. కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ఆనందపురం, తగరపువలస, దాకమర్రి, భీమిలి, కొత్తవలస, పరవాడ ప్రాంతాలతో పాటు సబ్బవరం, అచ్చుతపురంలో లేఅవుట్‌లను అభివృద్ధి చేసి వారి అభిమానాన్ని చూరగొన్నామన్నారు. ఇంతటి విజయానికి సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో కేకేరాజు

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం డీఆర్‌ఎం కార్యాలయం వద్ద డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం రూపుమాపేందుకు, మహిళల హక్కులను కాపాడేందుకు అంబేడ్కర్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్) సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆర్ఎస్ఎ పరీడా, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డైరెక్టర్ -యూజీసీ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏయూ, ఎస్‌ఏడీ పాల్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ (మెయిన్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్), నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 10వ తరగతి తరువాత చేరబోయే వివిధ కోర్సుల గురించి, ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధంగా ఉండాలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ


చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో గురుకులం సమన్వయాధికారి రూపవతి

ఆరిలోవ: ఇటీవల జాతీయ స్థాయిలో విజయవాడలో డ్రీమ్స్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమి ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ పోటీలలో శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు 15 స్వర్ణ పతకాలు, 10 వెండి పతకాలు సాధించారు. సోమవారం గురుకులాన్ని సందర్శించిన జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గైరమ్మ సారె ఊరేగింపు


పలు రకాల వంటకాలతో సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

- బంగారుమెట్ట, ఎల్‌జీ పురంలో గైరమ్మ పండగ
- వంటకాలతో భారీగా తరలివచ్చిన మహిళలు
- సారె ఊరేగింపులో పాల్గొన్న ప్రభుత్వవిప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో గైరమ్మ పండగ సందర్భంగా సోమవారం సాయంత్రం భారీగా సారె ఊరేగింపు నిర్వహించారు. ఐదేళ్లకోసారి నిర్వహించే గైరమ్మ సంబరానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24న గైరమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన సారె ఊరేగింపులో రెండు గ్రామాల మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఇళ్లల్లో తయారు చేసిన పలు రకాల వంటకాలతో సారె ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పులు, వాయిద్యాలు, నేల డ్యాన్స్‌లు, బాణసంచా వెలుగుల మధ్య ఉత్సాహంగా ఊరేగింపు జరిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సారె ఊరేగింపులో పాల్గొని శివపార్వతుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ అధ్యక్షులు సాయం రమేష్, సర్పంచ్ మేరుగు కుమారి బాబూరావు, తమరాన శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు తమరాన దాసు, దొండా శ్రీను, యెనుముల వాసు, సాయం శేషు, దొండా రాజా, కుమార్, తమరాన రమణ, కమలనాయుడు, మణికంఠ, జగ్గారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.